
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## 106 వ భాగం

# పురంజనోపాఖ్యానం; వేనుడి చరిత్ర - 2

కిందటి వ్యాసంలో ధ్రువుడి వంశం గురించి చెప్పుకున్నాం. అది సాగి సాగి అంగుడనే ఆయన దగ్గిరకి వచ్చింది. ఆయన సునీథ అనే అవిడని చేసుకున్నాడు. ఈవిడ ఎవరంటే సాక్షాత్తూ మృత్యుదేవత కూతురుట. అంటే ఎవరో ఏమీ కనికరం లేని క్రూరాతి క్రూరుడని చెప్పుకుందాం ప్రస్తుతానికి. ఈయనకి వేనుడెలా పుట్టాడో చెప్తున్నారు ఇప్పుడు.

సీ. అనఘాత్మ! రాజర్షి యైనట్టి యయ్యంగ
మేదినీ విభుఁ డశ్వమేధమఖము
గావింప ఋత్విజ్నికాయంబు చేత నా
హూత మయ్యును సురవ్రాత మంత
నాత్మ హవిర్భాగ మంద రాకుండిన
నప్పుడు ఋత్విక్కు లద్భుతంబు
నందుచు యజమానుఁడైన యయ్యంగ మ
హీవరుఁ జూచి రాజేంద్ర! యిట్లు [4-394]

తే. త్రిదశు లిదె పిల్వబడియును దివిరి యాత్మ
భాగములఁ బొంద రా రైరి భవ్యచరిత!
యేమి హేతువొ యిది మాకు నెఱుఁగఁబడదు;
కనఁగ హోమంబు దుష్టంబు గాదు మఱియు. [4-394-.1]

అంగుడు అశ్వమేధం మొదలుపెట్టాడు. అదయ్యాక ఋత్విక్కులు ఇచ్చిన హవిర్భాగాలని దేవతలకి అర్పించినప్పుడు ఎవరూ రాలేదు తీసుకోవడానికి. ఏదో తప్పు జరిగిందాలి కదా అని ఆ ఋత్విక్కులనే అడిగాడు. వాళ్ళేమంటున్నారంటే, మేము చేసినవన్నీ బాగానే ఉన్నాయి, కానీ దేవతలు వచ్చి తీసుకోకపోవడానిక్కారణం ఏమిటో మాకూ తెలియడంలేదు. హోమం బాగానే ఉంది (దుష్టంబు గాదు).

వ. శ్రద్ధాయుక్తులై ధృతవ్రతులైన యీ బ్రహ్మవాదులచేత సంప్రయుక్తంబు లైన యీ ఛందస్సులు వీర్యవంతంబులయి యున్న యవి; ఇందు దేవతాపరాధం బణుమాత్రం బయిన నెఱుంగము; ఇట్టిచోటం గర్మసాక్షు లయిన దేవతలు స్వకీయ భాగంబు లంగీకరింపకుండుటకుఁ గతం బెయ్యదియో" యనిన న య్యంగుండు దుఃఖితస్వాంతుండై తన్నిమిత్తంబు సదస్యుల నడుగం దలంచి వారల యనుమతిం బడసి మౌనంబు మాని యిట్లనియె. [4-395]

ఈ అశ్వమేధం చేయించిన బ్రహ్మవాదులు శ్రద్ధాయుక్తులై, ధృతవతులైనవారు (దీక్ష నియమించుకున్నవారు). అందువల్ల దేవతాపరాధం లేదు. కానీ దేవతలు రాకపోవడానిక్కారణం మాత్రం తెలియడం లేదు. ఋత్విక్కులే ఇలా అనేసరికి ఇప్పుడు అంగుడు అక్కడున్న సదస్యులని అడుగుతున్నాడు, “నా మూలాన ఏమి అపరాధం జరిగింది?” ఈ వచనంలో మొదటి వాక్యం గమనించండి. యజ్ఞం చేసేటపుడు ఎవరు ఎలా ఉండాలో చెప్తోంది కదా? శ్రద్ధ, యుక్తి, దీక్ష, మనో వాక్కాయకర్మలతో శుద్ధిగా చేయించాలి. ఇక్కడ అలా చేయించినా హవిర్భాగాలకి దేవతలు రాలేదు. అంగుడికి ఇప్పుడు సదస్యులు చెప్తున్నారు.

క. “నరనాథా! యిది యిప్పుడు
పొరసిన దుష్కృతము గాదు పూర్వభవమునం
బరఁగిన దురితం బిది యా
దరమున నెఱిగింతు మింత ధన్యచరిత్రా [4-397]

క. నీ వింతవాఁడ వయ్యును
భూవర! సంతానలాభమును బొందమి నా
దేవతలు యాగభాగము
లీ వేళ భుజింప రైరి [4-398]

తే. పుత్రకామేష్టిఁ గావించి పుత్రుఁ బడయు
మట్లొనర్చిన దేవత లాత్మభాగ
మర్థి నంగీకరింతు; ర య్యజ్ఞ పురుషు
హరి భజించిన సకల కార్యములుఁ గలుగు." [4-399]

సదస్యులు చెప్తున్నారిప్పుడు – ఇప్పుడు చేసిన తప్పుకాదు ఇది. ఏదో జన్మలో చేసిన కర్మ ఇలా తన్నుకొచ్చింది. సంతానం లేకపోతే దేవతలు యాగభాగం తీసుకొవడానికి రాలేదు. ఇది పోవడానికి దారి ఏమిటంటే, పుత్రకామేష్టి చేసి పిల్లల్ని కనాలి. యజ్ఞపురుషుణ్ణి పూజిస్తే అన్ని కార్యాలు సఫలం అవుతాయి. ఇదే విషయం రామాయణంలో కూడా చూడవచ్చు దశరధుడి విషయంలో.

చ. కమలదళాక్షి పాయసము గౌతుక మొప్ప భుజించి భర్తృ సం
గమమునఁ జేసి తత్క్షణమ గర్భముఁ దాల్చి కుమారుఁ గాంచె న
క్కొమరుఁడు నంత మాతృజనకుం డగు మృత్యువుఁ బోలి తా నధ
ర్మమునఁ జరించుచుండె గుణమండన! వేనుఁ డనంగ నిచ్చలున్ [4-401]

పుత్రకామేష్టి అయ్యాక పుట్టాడు వేనుడనేవాడు. సునీథ మృత్యువు కూతురుట. అందువల్ల తాతగారి గుణాలన్నీ వచ్చాయి కుర్రాడికి. చేసేవన్నీ అధర్మంగా చేయడం మొదలుపెట్టాడు. చిన్న విషయం మాట్లాడుకుందాం. మృత్యువు చేసేవన్నీ అధర్మపు పనులా అనే విషయం మీద. 'అయ్యో ఈ దంపతులు యాభై ఏళ్ళు కలిసి ఉన్నారు, వీళ్లని విడదీయకూడదు; ఈ కుర్రాడింకా చిన్న వాడు అందువల్ల ఈ పిల్లాడికి తల్లీ తండ్రీ అవసరం, అనే జాలి ఎవరి మీదా చూపించదు మృత్యువు. అది మనకి అధర్మంలా కనిపించవచ్చు. ఈ కథలో మృత్యువు వంటి తాత అని చెప్పుకుంటే అధర్మం పనులు చేసేవారెవరో ఒకాయన అనుకుందాం ఎందుకంటే పురంజనోపాఖ్యానంలో ఆయన పాత్ర మనకి అనవసరం.

చ. ఎనయఁగ బాల్యమందుఁ దన యీడు కుమారులఁ గ్రీడఁ బోలె నె
మ్మనమున భీతి లేక కృపమాలి పశుప్రకరంబు నొంచు పో
ల్కిని నరికట్టి చంపుచును గిల్బిషలుబ్ధక వృత్తిమై శరా
సనశరముల్ ధరించి మృగజాతి నసాధుగతిన్ వధించుచున్. [4-402]

తోటిపిల్లవాళ్లని కూడా పశువులని చంపినట్టూ చంపేవాడుట. చివరి పాదం మరో సారి చదవండి. మృగాలని కూడా – తినడానికో వాటి జాతి అమాంతంగా పెరిగిపోకుండా అరికట్టడానికో – అసాధుగతిన్ అధర్మంగా చంపకూడదు. కానీ వేనుడు మనుషుల్నే అలా చంపేవాడుట.

వ. ఇట్లు మాతామహ దోషంబునం బాపవర్తనుండై చరియించు కొడుకుం జూచి యంగుండు వివిధ శాసనంబుల దండించియు నతని దుశ్చేష్టితంబులు మానుపం జాలక దుఃఖితాత్ముండై మనంబున. [4-403]

క. అనయము నిట్టి కుపుత్రునిఁ
గని పరితాపంబుఁ బొందుకంటెను ధరలో
ననపత్యుం డగు టొప్పును
వనజాక్షు భజించునట్టి వాఁ డగువాఁడున్. [4-404]

క. తగు సుమహైశ్వర్యోదయ
మగు గృహమును బ్రజల, నిద్ర నందిన భార్యన్
దిగవిడిచి యెక్కడేనియు
జగతీశుఁడు చనె నిశీథ సమయము నందున్. [4-407]

కొంతకాలం కుర్రాడికి నయానో భయానో చెప్పిచూసాడు రాజు. వాడు మారలేదు. తానెటువంటివాడు? ధ్రువుడి సంతతి. తన కొడుకు ఇలా తయారయ్యాడేవిటి అనేదానికి ఒకటే సమాధానం. ఎవరి కర్మ వారిది. మనం ఎవర్నో మార్చడానికి ఎంత ప్రయత్నం చేసినా కుదరకపోవచ్చు ఒక్కోసారి. ఈయన ప్రయత్నం ఈయన చేసాడు. జ్ఞానోదయం కలిగింది – ఏమని అంటే? ఈ భార్యా, కొడుకూ తనకూడా వచ్చేవారు కాదు. తన కర్మ ఒకటే తన తోడుగా వచ్చేది. అందువల్ల రాత్రి (నిశీథ సమయము నందున్) ఇల్లూ వాకిలీ భార్యనీ అందర్నీ వదిలేసి వెళ్ళిపోయాడు.

వ. అంతఁ దద్వృత్తాంతం బంతయు సుహృద్బాంధవ పురోహితామాత్య ప్రభృతు లయిన ప్రజ లెఱింగి దుఃఖించుచున్న సమయంబున భూమి యందెల్ల యెడలఁ దదన్వేషణం బాచరించి గూఢుం డయిన పరమపురుషునిం గానలేని కుయోగి చందంబున నా రాజుం బొడగానలేక విఫలోద్యోగులయి మగిడి పురంబునకు వచ్చిరి; తదనంతరంబ. [4-408]

మర్నాటికో కొన్నాళ్లకో మొత్తానికి అందరికీ తెల్సింది. అంతా వెతికారు కానీ కుయోగి గూఢమైన భగవంతుణ్ణి చూడలేనట్టూ, ఆయన పట్టుకోలేక వెనక్కి వచ్చారు. రాజు లేకపోతే ఏమౌతుంది? దొంగలు ప్రజల్ని దోచుకోవడం మొదలుపెట్టారు రాజ్యంలో. కథలో నీతి ఇప్పటినుంచే చెప్తున్నాడు పోతన. భాగవతం ఎందుకు చదవడం? భగవంతుణ్ణి తెలుసుకోవడానికి. అలా తెలుసుకోవడానికి మంచి యోగి అయి ఉండాలి కానీ పై పై మార్పులు పనికిరావు. మనసు మారకుండా యోగి అని చెప్పుకుంటే చాలదు కదా?

సీ. సమధిక బ్రహ్మనిష్ఠాతిగరిష్ఠులౌ
భృగ్వాది మౌనీంద్ర బృంద మపుడు
లోకావనై కావలోకనోత్సుకు లైన-
జనులు స్వరక్షక జనవిభుండు
లేమిఁ బశుప్రాయులై మెలంగుటఁ గని-
యంత వేనుని మాత యగు సునీథ
యనుమతి నఖిల ప్రజావళి కప్రియుం-
డైన న వ్వేనుఁ బట్టాబిషిక్తుఁ [4-409]

తే. జేసి; రంతట మహితోగ్రశాసనుఁ డగు
వేనుఁ బట్టంబు గట్టుట విని సమస్త
తస్కరులు సర్పభీతిచేఁ దలఁగు మూషి
కముల కైవడి నడఁగిరి గహనములను. [4-409.1]

ఇప్పుడేం చేయాలి? వేనుడు పశుప్రాయుడని తెలుసు. ప్రజలకి అప్రియుడనీ తెలుసు. కానీ వీడు తప్ప మరొకరు లేరు. అందువల్ల రాజ మాత సునీథ అనుమతి తీసుకుని వీణ్ణే రాజుగా చేసారు. ఇందులో కాస్త సంతోషం ఏవిటంటే, ఈ పశుప్రాయుడు, ఉగ్రమైన శాశనాలు చేసేవాడు రాజు అయ్యాడని వినేసరికి అన్నీ దొంగతనం చేసే (అంటే ప్రభుత్వంలో, ఇంట్లో బయటా అన్ని రకాల దొంగలూ – సమస్త తస్కరులు) పాముని చూసి తమ కన్నాలలోకి పారిపోయే ఎలకల్లాగా అడవులలోకి (గహనములను) పారిపోయి దాక్కున్నారు. ఇప్పటివరకూ ఏదో కాస్త అధికారం ఉన్నవాడికి ఇప్పుడు పూర్తి అధికారం వచ్చింది చేతిలోకి.

చ. మఱియు నతండు భూగగనమార్గములం దొకవేళ నొక్కఁడే
యరదము నెక్కి ద్రిమ్మరు నిరంకుశవృత్తిఁ జరించు మత్త సిం
ధురవిభు పోల్కి సత్పురుషదూషిత వర్తన నొప్పుచున్ నిరం
తర సుజనాపరాధకృతి తత్పర మానసుఁడై క్రమంబునన్. [4-412]

రాత్రిపూట రథం ఎక్కి ఆకాశంలో, భూమ్మీదా ఇష్టం వచ్చినట్టూ సుజనులకి అపరాధం చేస్తూ నిరంకుశంగా తిరగడం మొదలుపెట్టాడు. రాజ్యం సంగతి సరేసరి. ఈ తిరగడం ఎలా ఉండి అంటే మదమెక్కిన ఏనుగుల రాజు లాగా. ఈ పద్యంలో రథం, ఏనుగు, రాజు అనే పదాలు ఎక్కడున్నాయో చెప్పగలరా? అరదము – రథము; సింధురము – ఏనుగు; విభుడు – రాజు.

రాజ్యం ఇలా తయారైంది వేనుడి అధికారంలో. మంత్రులూ, ప్రజలూ ఇంత దుర్మార్గుడికి అసలు అధికారం ఎందుకు కట్టబెట్టామా అనుకోవడం సహజం కదా? వాళ్ళేం చేస్తే మంచిది ఇప్పుడు? వెంఠనే అధికారంలోంచి దించడమా, లేకపోతే ఏదో ఒకటి మాట్లాడి చూద్దమా? అది ముందు వ్యాసంలో తెలుస్తుంది.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS